క్లుప్తంగా

సారిపల్లిలో అన్న సమారాధన



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లిలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో అమ్మవారికి వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు



ఎంపికైన బాలికలతో నిర్వాహకులు

నెల్లిమర్ల: పట్టణంలోని థామస్‌పేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో నియోజకవర్గస్థాయి అండర్‌-14, అండర్‌-17 కబడ్డీ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. బాలురు, బాలికల టీమ్‌లకు వేర్వేరుగా ఎంపికలు చేపట్టారు. అలాగే అండర్‌-17 అథ్లెటిక్స్‌కు బాల,బాలికలకు ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీలను నెల్లిమర్ల ఎంఈఓ ఈపు విజయ్‌కుమార్ పర్యవేక్షించారు. స్కూల్ గేమ్స్ నియోజకవర్గ సమన్వయకర్త, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు నడిపేన సూర్యనారాయణ, పతివాడ శ్రీనివాసరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

విజయనగరం పూల్‌బాగ్: ఏఐఎస్‌ఎఫ్ 49వ మహాసభల కరపత్రాలను డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి. ఫణీంద్ర మాట్లాడుతూ.. విజయనగరం జిల్లాలో నిర్వహిస్తున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్. నాగభూషణం, పి. గౌరీశంకర్, ఎ. సుమన్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తొలగించరూ..



సర్వేశాఖ కార్యాలయం పక్కన పేరుకుపోయిన చెత్తా, చెదారం

విజయనగరం ఫోర్ట్: కలెక్టరేట్‌లోని సర్వే శాఖ కార్యాలయం పక్కన చెత్త పేరుకుపోయింది. రోజుల తరబడి ఇదేవిధంగా ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహ్లాదకరంగా, ఆదర్శంగా ఉండాల్సిన కలెక్టరేట్ చెత్తకు నిలయంగా మారడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దుప్పాడలో పారిశుధ్య పనులు



కాలువల్లో పూడికలు తొలగిస్తున్న కార్మికులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పంచాయతీ విస్తరణాధికారి తిరుపతిరావు తెలిపారు. కాలువల్లో పూడికలు తీయడం, వాటర్ ట్యాంక్ క్లీనింగ్, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ పనులు చేపట్టినట్లు చెప్పారు.

పౌష్టికాహారం తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి అడల్ట్స్ హెల్త్ కౌన్సిలర్ అంబళ్ల కొండమ్మ అన్నారు. ఎంఆర్ సంస్కృత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. 10 నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లల్లో భౌతికపరమైన పెరుగుదల ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ వయసులో ఎత్తు, శరీరంలో మార్పులు సంభవిస్తాయని తెలిపారు. ఈ మార్పులు రావడానికి పౌష్టికాహారం అనేది చాలా అవసరమని తెలిపారు. వీలైనంత వరకు జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.

ప్రకృతిసాగుతో ఆరోగ్యం..

- సహజ ఎరువులు, కషాయాలతో పంటలకు మేలు
- పెరుగుతున్న ప్రకృతి సాగు విస్తీర్ణం



వరి పైరులో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన పసుపు బోర్డులు



భరిణికాంలో దశపర్ణ కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు

పూసపాటిరేగ: మారిన జీవనశైలితో ప్రస్తుతం మానవాళికి ప్రకృతి పంటలు అవసరం అవుతున్నాయి. ప్రకృతిసాగు పద్ధతులతో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతున్నాయి. అధిక పెట్టుబడి, తక్కువ దిగుబడులతో విసిగిపోయిన రైతులు ప్రకృతి వ్యవసాయంపైనే ఆసక్తి చూపిస్తున్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వాస్తవానికి పూర్వం ప్రకృతి పద్ధతులతో వ్యవసాయ చేసేవారు. ఆ తర్వాత ఎక్కువ దిగుబడులు సాధించడానికి రసాయన ఎరువుల వాడకం చేపట్టారు. అయితే రసాయన ఎరువుల విచ్చలవిడి వినియోగం వల్ల పెట్టుబడులు పెరిగిపోగా.. పైర్లకు లేనిపోని చీడపీడలు ఆశించేవి. పైగా దిగుబడుపై కూడా ఎరువుల ప్రభావం ఉండడంతో ప్రజలు రోగాల బారిన పడేవారు. ఈ పరిస్థితుల్లో ప్రకృతి సాగు పెంచాలనే ఉద్దేశంతో అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నారు. సేంద్రియ ఎరువుల తయారీ, చీడపీడల నివారణకు వినియోగించే కషాయాల తయరీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సుమారు 800 హెక్టార్లలో..

నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో పూసపాటిరేగ మండలంలో అత్యధికంగా ప్రకృతి వ్యవసాయం సాగు జరుగుతోంది. డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల మండలాల్లోనూ ప్రకృతి సాగు జరుగుతున్నా పూసపాటిరేగ మండలంలో కొంచెం ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపడుతున్నారు. మొత్తానికి నియోజకవర్గంలో సుమారు 800 హెక్టార్లలో కూరగాయలు, వరి, జామి, క్యాప్సికమ్, అరటి, బొప్పాయి వంటి పంటలు సాగవుతున్నాయి.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చు. జీవన ఎరువులు, కషాయాలు తయారీపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులు కూడా మొగ్గు చూపిస్తున్నారు. ప్రతి ఏడాదీ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

– కె.నీలిమ, మండల వ్యవసాయాధికారి, పూసపాటిరేగ

రైతులు మార్పు కోరుకుంటున్నారు

పంటల సాగు విధానంలో రైతులు మార్పులు కోరుకుంటున్నారు. గతంలో అధిక దిగుబడులు కోసం రసాయన ఎరువులు వినియోగిస్తే.. ఇప్పుడు దుష్ఫలితాలు తెలుసుకుని ప్రకృతి సాగు విధానంపై మక్కువ పెంచుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఎటువంటి హానిలేని ప్రకృతి సాగుపట్ల రైతులు ఆసక్తి చూపిస్తున్నారు.

– వి.కమల, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

వరలక్ష్మీ నాట్యాలయం విద్యార్థినుల ప్రతిభ



అలివేలుమంగమ్మ, వేంకటేశ్వర స్వామి వేషాధారణలతో వరలక్ష్మీ నాట్యాలయం విద్యార్థినుల నృత్యం

విజయనగరం టౌన్: ఆశ్వయుజమాసం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏలూరులోని ద్వారకా తిరుమలలో (చిన్నతిరుపతి) విజయనగరానికి చెందిన వరలక్ష్మీ నాట్యాలయం విద్యార్థినులు భరతనాట్యం ప్రదర్శించారు. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో 'ఆనందనర్తన గణపతి, సిరుతా నవ్వులవాడు చిన్నక్క, జగదపుతనువులజాజర వంటి పలు పాటలకు అలమేల మంగమ్మ, వేంకటేశ్వరస్వామి వేషాధారణలతో చేసిన పాటలు అందరినీ అలరించాయి. నాట్యాలయం అధ్యాపకురాలు పేరి వరలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు లలిత, నిఖిత, సాయివెన్నెల, సాయిస్మృతి, మౌన్యవి, శ్యామశ్రీ, యాశ్రితలు ప్రదర్శనలిచ్చారు.

సీబీసీఎన్‌సీ ఆస్తులపై విచారణ హర్షణీయం

- ట్రస్ట్ అసోసియేషన్ ఛైర్మన్ ఆర్.ఎస్.జాన్



మాట్లాడుతున్న సీబీసీఎన్‌సీ ట్రస్ట్ అసోసియేషన్ చైర్మన్ ఆర్‌ఎస్ జాన్

విజయనగరం టౌన్: సీబీసీఎన్‌సీ ఆస్తులపై బొబ్బిలి ఎమ్మెల్యే విచారణ చేపడతామని హామీ ఇవ్వడం హర్షణీయమని సీబీసీఎన్‌సీ ట్రస్ట్ అసోసియేషన్ చైర్మన్ ఆర్‌ఎస్ జాన్ అన్నారు. శుక్రవారం స్థానిక సిమ్స్ చర్చి ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1975లో కెనడా నుంచి వచ్చిన క్రైస్తవులు ఈస్ట్, వెస్ట్, ఉత్తరాంధ్ర, తదితర ప్రాంతాల్లో నిరుపేదల కోసం ఆస్పత్రులు, చర్చిలు, స్కూళ్లు కట్టారన్నారు. 1979 వరకు సీబీసీఎన్‌సీ ఆధీనంలో ఉన్న ఆస్తులపై కొన్నిచోట్ల ఇబ్బందులేర్పడ్డాయని చెప్పారు. ఈ తరుణంలో బొబ్బిలిలో ఉన్న సీబీఎం గర్ల్స్ హైస్కూల్‌కి చెందిన సుమారు రూ. 50 కోట్ల విలువైన స్థలాన్ని రత్నకుమార్ అనే వ్యక్తి అక్కడ వేరే వ్యక్తికి విక్రయించాడని తెలిపారు. అలాగే మరికొన్ని చోట్ల కూడా సీబీసీఎన్‌సీ ఆస్తులు పరాధీనం అయ్యాయని చెప్పారు. ఇదిలా ఉంటే ఈ నెల 16న బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన సీబీసీఎన్‌సీ ఆస్తులపై విచారణ చేస్తామన్న ప్రకటించడం హర్షణీయమన్నారు. విచారణ చేపట్టి సంస్థ ఆస్తులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ ఆదాడ మోహనరావు, తాలాడ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు

- సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లిమర్ల: ప్రజలపై సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ భారాలు మోపవద్దని సీపీఎం నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, ఏఈపిచ్చుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్దుబాటు, ట్రూఅప్ చార్జీల పేరిట 20 వేల కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపడం దుర్మార్గమన్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ బాదుడే బాదుడు.. అనే కార్యక్రమాన్ని నిర్వహించి, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం చార్జీలు పెంచడం దారుణమన్నారు. కార్యక్రమంలో కనకల రాము, బి. నారాయణ, ఎం. సన్యాసిరావు, జె. సత్యారావు, టి. తాత, తదితరులు పాల్గొన్నారు.

జొన్నవలసలో 'పొలంబడి'



రైతులకు సలహాలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు

విజయనగరం రూరల్: తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఎలా పొందవచ్చునో పొలంబడి ద్వారా తెలుసుకోవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వీటీ రామారావు అన్నారు. మండలంలోని జొన్నవలసలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొలంబడిలో పాల్గొనే రైతులకు ఐఎన్‌డీ గ్యాప్ సరిఫికెట్ ఇస్తామన్నారు. అనంతరం సారిక గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. పాముపొడ తెగులు అధికంగా ఆశించినట్లు గుర్తించి, దీని నివారణకు కార్బాన్ హైడ్రాక్లోరైడ్ 400 గ్రాములు సరిపడా నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు నాగభూషణం, మండల వ్యవసాయశాఖాధికారి హర్షలత, ఎఫ్‌పీఓ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి



ఇస్కాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. మండలంలోని సీతారామునిపేట ఇస్కాన్ ఆలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కృష్ణుడి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇస్కాన్ సంస్థ ప్రజల్లో భక్తి భావాలను పెంపొందించడం గర్వకారణమన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, సర్పంచ్ రాంబార్కి రామయమ్మ, వైస్ సర్పంచ్ కల్యాణం రమణ, నాయకులు రామారావు, తర్లాడ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు



చదురుగుడి వద్ద చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా చదురుగుడి, వనంగుడుల వద్ద నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు అద్యంతం ఆహూతులను ఆకట్టుకున్నాయి. స్థానిక చదురుగుడి ఆవరణలో శుక్రవారం రాత్రి అమృత శ్రీవర్షిణి స్కూల్ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ బృందం నిర్వహించిన నృత్య ప్రదర్శన అలరించింది. అనంతరం ఉపద్రష్ట వరలక్ష్మి హరికథాగానం ఆకట్టుకుంది. కేపీ నాయుడు భక్తిగీతాలు ఆద్యంతం భక్తిభావాన్ని పెంపొందించాయి. రైల్వేస్టేషన్ వద్ద నున్న వనంగుడి ఆవరణలో ఎ.నాగపార్వతి సంగీతకచేరీ.. మద్ది సూరప్పడు అన్నమయ్య కీర్తనలు.. మక్కువ సూరినాయుడు, సిరిపురపు పోతినాయుడుల ఏకపాత్రాభినయనాలు అలరించాయి. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

పూసపాటిరేగ: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని సర్పంచ్ లంకలపల్లి గాయత్రి అన్నారు. మండలంలోని నడిపల్లి గ్రామంలో రోడ్లు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ నిధులతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఆమెతో పాటు ప్రజాప్రతినిధులు లంకలపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అక్కివరంలో నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

డెంకాడ: మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. అక్కివరం, గుణుపూరుపేట, నాతవలస, గొలగాం గ్రామాల్లో పలు నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కంది సూర్యనారాయణ, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



చిట్టిగుంకలాం గ్రామ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి

డెంకాడ: గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి.పద్మావతి అన్నారు. మండలంలోని చిట్టిగుంకలాంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రీ సర్వేలు జరిగిన గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి చర్యలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా 36 మంది రైతులు సవరణల కోసం అర్జీలు సమర్పించారు.

ఘనంగా యోగారాధన



మాట్లాడుతున్న యోగా సాధకులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో గల 'శ్రీ యోగా' కేంద్రంలో యోగా ఆచార్య రాపర్తి రామారావు ఆరాధన కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ప్రశాంతతతో కూడిన జీవనం లభిస్తుందన్నారు. ప్రపంచానికి భారత దేశం అందించిన మహోన్నత కానుక యోగా అని తెలిపారు. గురుదేవుల స్ఫూర్తితో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం పలువురికి వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుసుమంచి సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గీత గోవిందరావు, శ్రీ యోగా ఫౌండేషన్ ప్రతినిధి కొవ్వాడ శ్రీనివాసరావు, సత్యనారాయణ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి



వెయిట్ లిఫ్టర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, ఎంపీపీ సుధారాణి, తదితరులు

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి

నెల్లిమర్ల రూరల్: యువతీ, యువకులు క్రీడల్లో ప్రావీణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి సూచించారు. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్న మండలంలోని సీతారామునిపేటకు చెందిన క్రీడాకారులను శుక్రవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కొండవెలగాడకు చెందిన వెయిట్‌లిఫ్టర్లు పదుల సంఖ్యలో పతకాలు సాధించడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, కూటమి నాయకులు కడగల ఆనంద్, చనమల్లు రమణ, గేదెల రాజారావు, అంబళ్ల అప్పలనాయుడు, రవ్వా నాని పాల్గొన్నారు.

నిరసన



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద నిరసన తెలియజేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

విజయనగరం ఫోర్ట్: పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. జనరల్ డ్యూటీ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, మార్చురీ అటెండెంట్, ల్యాబ్ అటెంట్స్‌గా ఔట్ సోరింగ్ పద్ధతిలో 14 నెలలుగా పనిచేస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి జీతాలు మంజూరు కాలేదని వాపోయారు. అప్కోస్ పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు చేయకపోవడం వల్లే జీతాలు రాలేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కల్యాణ్, సుందర్, రామకృష్ణ, బంగారుతల్లి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



రహదారి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, ఎంపీపీ సుధారాణి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని సీతారామునిపేట వద్ద రూ.2 కోట్ల ఉపాధి హామీ నిధులతో నిర్మించబోయే గిరి ప్రదక్షణ రహదారికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో రామతీర్థం దేవస్థానానికి ఎంతో ఘనకీర్తి ఉందని, ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి రోజున జరిగే గిరి ప్రదక్షణలకు వేలాది మంది భక్తులు హాజరవుతారన్నారు. ఇంత వరకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.12 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే సీసీ రహదారులు, కాలువల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, సర్పంచ్‌లు నడుపూరి గౌరి, రాంబార్కి రామలక్ష్మి, కంచరాపు సూర్యకళ, ఎంపీటీసీ సభ్యురాలు తర్లాడ జయమ్మ, కూటమి నాయకులు కడగల ఆనంద్, చనమల్లు రమణ, గేదెల రాజారావు, అంబళ్ల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ఎల్ఐసీ పాలసీలు



ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏజెంట్ల యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: ఎల్ఐసీ పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) జోనల్ కమిటీ సభ్యుడు బడ్డుకొండ వెంకటరమణ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్ఐసీ యాజమాన్యం తిరోగమన నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. కొత్త పాలసీలపై పెంచిన ప్రీమియంను తగ్గించాలని కోరారు. బ్రాంచ్ అధ్యక్షుడు చిల్లా రామకృష్ణ మాట్లాడుతూ.. పాలసీలపై బోనస్ పెంచి, జీఎస్టీని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో విశాఖ డివిజన్ ఉపాధ్యక్షుడు జరజాపు వాసుదేవరావు, బ్రాంచ్ కార్యదర్శి ఇల్లాపు కృష్ణ, కోశాధికారి తుమ్మలగుంటి పవన్‌కుమార్, గౌరవాధ్యక్షుడు సబ్బవరపు సూరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.